సాక్షి
హనుమకొండ

మంగళవారం | 14 | ఫిబ్రవరి | 2023



వేయిస్తంభాల గుడిలో...

వేయిస్తంభాల ఆలయంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ శేషగిరి కోరారు. - 8లో▶



రెవెన్యూ వసూళ్లు పెంచాలి

రెవెన్యూ వసూళ్లు పెంచాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. - 8లో▶

గరిష్టం/కనిష్టం
32.0⁰/15.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతోపాటు సూర్యరశ్మితో చాలా వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వినతులు వెంటనే పరిష్కరించండి



హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని పరకాల ఆర్డీఓ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు పరకాల ఆర్డీఓ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో తహసీల్దార్ ఆఫీసుకు 15, కలెక్టరేట్ డి సెక్షన్‌కు 8, ఆర్డీఓ హనుమకొండకు 11, 2బీహెచ్‌కే నోడల్ ఆఫీసుకు 7తో పాటు మొత్తం 85 వినతులు అందాయి. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కిరణ్‌ప్రకాశ్, డీడబ్ల్యూఓ సబిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీసీఎస్‌ఓ వసంతలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో సోమవారం డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్లకు పట్టుబడి ఆరుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు జి.మధుకర్, ఎ.నరేందర్ తెలిపారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం



న్యూశాయంపేట: హజ్ యాత్రకు వెళ్లాలనుకున్న ముస్లింలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను తెలిపారు. సోమవారం సుబేదారిలోని ఆయన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ఆవిష్కరించారు. పూర్తి వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హజ్‌కమిటీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజు, హజ్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సర్వర్ మోహియొద్దీన్, టీఆర్ఎస్ నాయకులు నజీరుద్దీన్, షకీల్ అహ్మద్, ఖాసీం ఖాన్ బియాబాని, సుల్తాన్, షహబాజ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ దాసరి ఉమామహేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి మార్చి 6వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.వంద చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక ఫోన్ నంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చని సూచించారు. 2022–23లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం 11 గంటల నుంచి 1గంట వరకు ఉంటుందని జిల్లాలో గుర్తించిన కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం పొందిన వారికి 10వ తరగతి వరకు ఉచిత చదువు భోజన వసతి ఉంటుందని వివరాలకు www.tswreis.in, www.tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని జిల్లా కో–ఆర్డినేటర్, మడికొండ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి సూచించారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విద్యారణ్యపురి: 317 జీఓ ద్వారా బదిలీ అయిన టీచర్లకు ఈనెల 12 నుంచి బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 12న దరఖాస్తు చేసిన వారికి సోమవారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పర్యవేక్షణలో పీజీహెచ్‌ఎంలు డీఈఓ కార్యాలయ సిబ్బంది సర్టిఫికెట్లు, సర్వీస్‌బుక్స్ పరిశీలించారు. ఈనెల 13న దరఖాస్తులు చేసిన వారికి 14న, ఈనెల 14న దరఖాస్తులు చేసినవారికి 15న డీఈఓ కార్యాలయంలో వెరిఫికేషన్ ఉంటుందని డీఈఓ తెలిపారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్ ఉన్న బి.కుమార్‌ను ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్‌గా, ఆత్మకూరులో పనిచేస్తున్న టి.గణేశ్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు.

ప్రేమలో గెలిచారు.. జీవితంలో నిలిచారు!



ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఎదుర్కొన్నారు

- భర్త ప్రాణాలకు తన జీవితం అడ్డుపెట్టిన భార్యలు
- లివర్, కిడ్నీలు దానం చేసిన సతీమణులు
- ప్రేమ అనే అర్థానికి నిదర్శనమయ్యారు
- నేడు ప్రేమికుల దినోత్సవం



ప్రేమ.. రెండు మనసుల కలయిక.. ఒకరినొకరు అర్థం చేసుకోవడం.. రెండు భావాల కలబోత.. ఒకరి మనోభిప్రాయాలను మరొకరు గౌరవించడం.. ఒకసారి మనసిస్తే జీవితాంతం తోడుంటానని భరోసా ఇవ్వడం.. కష్టమొస్తే నేనుంటానంటూ చేయందించడం.. అలాంటి ప్రేమకు తిరుగులేదు. ప్రేమ కులాలు, మతాలు చూడదు.. పేద, ధనిక అనే తరతమ్యం ఎరుగదు. భర్తకు కిడ్నీ పాడైతే తన కిడ్నీ ఇచ్చిన భార్య ఒకరు.. కరోనా భూతానికి లివర్ చెడిపోయిన భర్తకు తన లివర్ ఇచ్చిన భార్య ఇంకొకరు.. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుని వారిని మెప్పించిన జంట మరొకరు.. ఇలా సమాజంలో సక్సెస్‌ఫుల్ ప్రేమ జంటలు అనేకం. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమించి పెళ్లి చేసుకుని జీవితంలో నిలిచి చూపిన జంటలపై ప్రత్యేక కథనాలు..

- వరంగల్/ఆత్మకూరు/పరకాల/దామెర/కేయూ క్యాంపస్

• పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నాం



మేం పెద్దలను ఎదురించి 1991లో ప్రేమ వివాహం చేసుకున్నాం. అప్పట్లో కులం పట్టింపులు ఎక్కువగా ఉండేవి. ఆ తర్వాత ఇరువురి కుటుంబాలు ఒప్పుకున్నాయి. మొదట్లో ఉద్యోగం లేక చాలా ఇబ్బందులు పడ్డాం. తర్వాత నేను వీఆర్‌ఏగా, వీఆర్‌ఓగా ఉద్యోగాలు సాధించా. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. నా భార్య రాణి ఆశ కార్యకర్తగా పనిచేస్తోంది. మాకు సంతానం లేకున్నా.. మా దాంపత్య జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ఆనందంగా గడుపుతున్నాం.

– వర్కూటి సత్యనారాయణ, రాణి, దామెర

• ఆత్మస్థైర్యంతో ముందుకు..



రూపేశ్ విజయచందర్, సునీతలు దివ్యాంగులు. ఇద్దరి మనస్సులు కలవడంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. రూపేశ్ పుట్టుకతోనే అంధుడు. 2002లో ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–4 పరీక్ష రాసి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించాడు. 2011లో పరిచయమైన దివ్యాంగురాలైన సునీతతో ప్రేమలో పడి ఆదర్శ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఐనవోలు మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. సునీత గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే అంధత్వం అడ్డుకాదని, ఏదైనా సాధించవచ్చని నిరూపించారు రూపేశ్ దంపతులు.

– రూపేశ్ విజయచందర్, సునీత, హనుమకొండ

• డిగ్రీలో ప్రేమ చిగురించి.. పీజీలో వివాహం



మూడు దశాబ్దాల క్రితం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ కళాశాలలో చదువుకున్న రోజుల్లోనే శోభారాణితో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించి పీజీలో విహహం చేసుకున్నాం. శోభారాణిది ఉన్నత కుటుంబం. మాది పేదరికం. దీంతో ఆమె తరఫు వాళ్లు ఒప్పుకోలేదు. మా వివాహం వరంగల్‌లోని ఓ సత్రంలో 1989లో జరిగింది. మొదట అద్దె ఇంట్లో ఉంటూ ఫ్యాన్ల విక్రయ దుకాణం పెట్టా. ఆ తర్వాత ఆర్ట్స్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పని చేస్తూనే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేశా. 2000 సంవత్సరంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా.. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ వరకు ఎదిగా. మేం ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డాం. ఇద్దరు కుమారులు. ఒక కూతురు. అందరూ బాగా చదువుకుంటున్నారు. చివరికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా రిటైరయ్యా. కుమార్తె శ్రీవిద్య కొన్నేళ్ల క్రితం చనిపోవడం మా కుటుంబానికి తీరని విషాదం. పిల్లలు ప్రేమలో పడితే తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి.

– గాదె పాణి, శోభారాణి, కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు

• భర్త ప్రాణాల కోసం లివర్ దానం చేసిన భార్య



మరణం అంచుకు వెళ్లిన భర్తను మరో సతీసావిత్రిలా పోరాడి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భర్తను కాపాడుకొని ఆదర్శప్రాయురాలిగా నిలిచింది ఓ మహిళామణి. పరకాల పట్టణానికి చెందిన బండి సదానందం–పద్మ 24 ఏళ్ల క్రితం ప్రేమించుకొని.. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వీరిద్దరికి ఇద్దరు కుమారులు. సంతోషంగా గడుపుతున్న సమయంలో కరోనా ఆ కుటుంబంలో భయానక వాతావరణం సృష్టించింది. కరోనా బారిన పడ్డ సదానందానికి వైద్యం అందించే క్రమంలో స్టెరాయిడ్స్ మోతాదు మించి లివర్ పూర్తిగా దెబ్బతింది. సదానందం లివర్‌ను తొలగించి మరొకరి లివర్ పెట్టాలని వైద్యులు సూచించారు. దీంతో భర్త ప్రాణాలే తనకు ముఖ్యమని సదానందం భార్య పద్మ తన లివర్‌ను దానం చేసింది. దీంతో సదానందం పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం ఆకుటుంబం ఆనందంగా ఉంది.

– సదానందం, పద్మ

• ప్రేమను గెలిచింది.. భర్తకు పునర్జన్మనిచ్చింది



శ్రీవాణి, కోటేశ్వర్‌లది పరకాల మండలం నాగారం గ్రామం. ఒకే గ్రామం కావడంతో వీరి ప్రేమ పెళ్లి వరకు వెళ్లింది. 1999లో పెళ్లి చేసుకొని ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్లకు వచ్చి వైద్య వృత్తి చేసుకుంటూ స్థిరపడ్డారు. ఆనందంగా సాగుతున్న వారి జీవితంలో 2010లో భారీ కుదుపు వచ్చింది. కోటేశ్వర్‌కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. రెండేళ్లపాటు డయాలసిస్ చేయించుకున్నాడు. ఇక ఆరోగ్యం సహకరించని పరిస్థితి. తనలో సగమైన భార్య శ్రీవాణి తన కిడ్నీ ఇచ్చింది. 24 ఏళ్లుగా భర్త వెన్నంటే ఉంటోంది. కోటేశ్వర్ ఎంతో మందికి ఉచితంగా వైద్యసేవలు అందించారు.

– కోటేశ్వర్‌తో భార్య శ్రీవాణి

రేపు బస్తీ దవాఖానాలు ప్రారంభం

- ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు



క్రిస్టియన్ కాలనీ బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, కలెక్టర్

వరంగల్ అర్బన్/ఖిలా వరంగల్: వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ పార్క్‌లో, 37వ డివిజన్ గిరిప్రసాద్ నగర్‌లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలను మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వరంగల్ కలెక్టర్ బి.గోపి పరిశీలించారు. ఈనెల 15న బస్తీ దవాఖానలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వరంగల్ డీఎంఅండ్ హెచ్‌ఓ వెంకటరమణ, కార్పొరేటర్లు వస్కుల బాబు, భోగి సువర్ణ చింతాకుల అనిల్, కంటి వెలుగు ప్రత్యేక అధికారి ప్రసాద్, బల్దియా ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ ధ్వని చేస్తే చర్యలు

- సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: సమయ పాలన పాటించకుండా రాత్రి సమయాల్లో అధిక ధ్వని చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో కొంత మంది వ్యక్తులు, సంస్థలు సమయపాలన పాటించకుండా లౌడ్ స్పీకర్లు వినియోగిస్తుడడంపై పోలీసులకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో వృద్ధులు, వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం, విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. వ్యక్తులు, సంస్థలు ఉదయం 6 గంటలకు ముందు గానీ రాత్రి 10 గంటల తర్వాత గానీ డీజేలు, వాయిద్యాలు, క్రాకర్లు కాల్చడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలెవరికైనా ఈవిషయంలో ఇబ్బందులు ఎదురైతే డయల్ 100 ఫోన్ చేయాలని సూచించారు. ఒకవేళ సదరు అధికారి వారిపై చర్య తీసుకోకపోతే వరంగల్ పోలీస్ కమిషనర్ 87126 85100కు మెసేజ్ చేయాలని ఆయన ప్రజలను కోరారు.

రేపట్నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- హాజరవనున్న 14,173 మంది విద్యార్థులు
- డీఐఈఓ ఎ.గోపాల్

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ఈనెల 15 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నారు. బైపీసీ, ఎంపీసీ సెకండియర్, ఒకేషనల్ కోర్సుల సెకండియర్ విద్యార్థులు ఈపరీక్షలకు హాజరుకానున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి ఎ.గోపాల్ తెలిపారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 116 ఉన్నాయి. ఇందులో 76 పరీక్షా కేంద్రాలు జనరల్ సబ్జెక్టులకు, 10 పరీక్షా కేంద్రాలు ఒకేషనల్ కోర్సులకు కేటాయించారు. బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ కోర్సుల్లో సెకండియర్ చదువుతున్న 12,142 మంది విద్యార్థులు, ఒకేషనల్ సెకండియర్ విద్యార్థులు 2031 మంది మొత్తం 14,173 మంది ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి..

ఇంటర్, ఒకేషనల్ కోర్సుల సెకండియర్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ ఎ.గోపాల్ కోరారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఎగ్జామినర్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 162 మంది ప్రభుత్వ, ప్రైవేట్ లెక్చరర్లకు, ఎగ్జామినర్లుగా డ్యూటీలు వేసినట్లు తెలిపారు. 30 మంది డిపార్టుమెంటల్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. 83 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలపై నిర్వహించిన సమావేశంలో గోపాల్ పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర పాల్గొన్నారు.

16న గ్రేటర్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

వరంగల్ అర్బన్: జీడబ్ల్యూఎంసీ 2023–24 బడ్జెట్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర మేయర్ సుధారాణి అధ్యక్షతన జరిగే ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో 2022–23 సంవత్సరానికి సవరించిన అంచనాలను పాలక వర్గం పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎక్స్ ఆఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

• మాషూఖ్ రబ్బానీ ఉర్సు షురూ..



సందల్ ఊరేగింపులో యువత..

వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని హజ్రత్ మాషూఖ్ రబ్బానీ(రహమతుల్లా ఆలై) దర్గా ఉర్సు సోమవారం రాత్రి ప్రారంభమైంది. సోమవారం రాత్రి పీఠాధిపతి సయ్యద్ మోహినొద్దీన్ అహ్మద్ భక్తియార్ ఖాద్రీ ఇంటినుంచి దర్గా ప్రాంగణంలోని మాషూఖ్ రబ్బానీ సమాధి వరకు పకీర్ల విన్యాసాలు, మేళతాళాలతో సందల్ (గంధం) ఊరేగింపు వైభవంగా సాగింది.

– ఖిలా వరంగల్/కరీమాబాద్



గంధం తీసుకువస్తున్న ఎమ్మెల్యే నరేందర్

- వివరాలు 10లో▶

అరేంజ్ మ్యారేజ్‌కే మా ఓటు



చర్చాగోష్టిలో పాల్గొన్న విద్యార్థులు

- తల్లిదండ్రులను ఒప్పించి వివాహం చేసుకోవాలి
- పెద్దలు కుదిర్చిన పెళ్లయితే ఏ సమస్య వచ్చినా వారే చూసుకుంటారు
- పెళ్లికి ముందు.. పెళ్లి తర్వాత ప్రేమపై 'సాక్షి' డిబేట్

ప్రేమించి, తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటే ఆ బంధం బలంగా ఉంటుంది. పెద్దలు చూసిన సంబంధమైతే ఏ సమస్య వచ్చినా తల్లిదండ్రులు అండగా ఉంటారు' అని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎక్కువ శాతం మంది విద్యార్థులు పెద్దలు కుదిర్చిన వివాహం వైపే మొగ్గు చూపారు. మంగళవారం ప్రేమికుల రోజు సందర్భంగా నగరంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్టిలో విద్యార్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. – హసన్‌పర్తి

లవ్ మ్యారేజే మంచిది..



లవ్ మ్యారేజ్ చేసుకుంటే చాలా మంచిది. లవ్ చేస్తే ఇద్దరూ ఒక్కరినొక్కరు అర్థం చేసుకుంటారు. జీవి తాంతం ఆనందంగా ఉండొ చ్చు. పెళ్లికి ముందు నుంచే ప్రేమించుకుంటారు కాబట్టి పెళ్లి తర్వాత కూడా ఆ ప్రేమ కంటిన్యూ అవుతుంది. లవ్ మ్యారేజ్ వల్ల జీవితంలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడవు.

– క్రాంతి, బీఫార్మసీ

పెళ్లి చేసుకుని ప్రేమించడం బెటర్



పెళ్లి చేసుకుని ప్రేమించడం బెటర్. ప్రస్తుత సమాజంలో ప్రేమ వివాహాల వల్ల జరుగుతున్న పరిణామాలు చూస్తే తల్లిదండ్రులు చూసే సంబంధాలకే ప్రాధాన్యం ఇవ్వాలనిపిస్తోంది. లవ్ మ్యారేజ్ చేసుకుంటే అందరూ దూరమవుతారు. ఒకరి కోసం కుటుంబ సభ్యులందరిని దూరం చేసుకోవడం మంచిది కాదు.

– నరేశ్, బీఫార్మసీ

టీనేజ్ ప్రేమ ఆకర్షణే..



టీనేజ్ ప్రేమ అనేది ఆకర్షణ మాత్రమే. ఆకర్షణకు ప్రభావితమై పెళ్లి చేసుకుంటే జీవితం నరకంగా మారుతుంది. అయితే ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే ఎలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉండదు. వచ్చినా వాటిని పెద్దవాళ్లు పరిష్కరిస్తారు.

– జియా, బీఫార్మసీ

ప్రేమిస్తే.. పెద్దలను ఒప్పించాలి



ప్రేమించి పెళ్లి చేసుకుంటే ఆ బంధం ఎక్కువ కాలం నిలిచే అవకాశం చాలా తక్కువ. ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. అప్పుడే ఆ ప్రేమ నిజంగా గెలిచినట్లు.

– షాహీన్, బీఫార్మసీ

ప్రాబ్లమ్స్ పరిష్కారమవుతాయి



పెద్దవాళ్లను ఎదిరించి పెళ్లి చేసుకుంటే అమ్మాయిలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇటు తల్లిదండ్రులు, అటు అత్తమామల సహకారం ఉండదు. ప్రేమించినా పెద్దవాళ్లను ఒప్పించిన తర్వాతే పెళ్లి చేసుకోవాలి.

– ఎం.నిఖిత, బీఫార్మసీ

'ఎమ్మెల్యే నరేందర్‌కు సంపాదనపైనే దృష్టి'

మాజీ మంత్రి కొండా సురేఖ

రామన్నపేట: తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్.. అభివృద్ధిని విస్మరించి, సంపాదనపైనే దృష్టి సారించారని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నగరంలోని 25వ డివిజన్ మహంకాళి గుడి, మండిబజార్ ప్రాంతాల్లో సురేఖ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. తూర్పులో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఇప్పుడేం అభివృద్ధి జరగలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసాల ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దోపిడీ చేసి దేశంపై పడ్డారు



మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

హసన్‌పర్తి: టీఆర్ఎస్ పార్టీతో తెలంగాణ రాష్ట్రాన్ని దోపిడీ చేసిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని లూటీ చేయడానికి వెళ్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ పేదరాష్ట్రంగా మార్చారని ఎద్దేవాచేశారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఈనెల 16న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వర్ధన్నపేటలో పర్యటించనున్నట్లు శ్రీనివాస్ వెల్లడించారు. సమావేశంలో మహేందర్‌రెడ్డి, తిరుపతి, చిర్ర సుమలత, పొన్నాల రఘు, చరణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ఆరెకుల 'చలో హైదరాబాద్' రద్దు

నయీంనగర్: ఈనెల 15వ తేదీన హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న ఆరెకుల భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం, ఆరెకుల సభను విజయవంతం చేయడానికి చేపట్టిన ఆరెకుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆరెకుల స్టీరింగ్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి కిషన్‌రావు తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆత్మహత్యా...హత్యా ?

- రెడ్డిపాలెంలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి
- రక్తపు మడుగులో కొండారెడ్డి మృతదేహం


కొండారెడ్డి(ఫైల్)

వరంగల్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ రెడ్డిపాలెంలో పురుగుల మందు తాగి కొలుకుల కొండారెడ్డి(45)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. కాగా, మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య జ్యోత్స్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. రెడ్డిపాలానికి చెందిన కొండారెడ్డి రెండేళ్ల క్రితం వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. నెల రోజులనుంచి మద్యం మత్తులోనే మునిగితేలుతున్నాడు. ఈ క్రమంలో జనవరి 23న కూతురు ప్రవల్లిక(సోనీ) ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు పంపేందుకు భార్యాభర్తలు హైదరాబాద్‌కు వెళ్లారు. కూతురును విమానం ఎక్కించిన అనంతరం కొండారెడ్డి భార్య జ్యోత్స్న పుట్టిల్లు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామానికి వెళ్లింది. కొండారెడ్డి మాత్రం రెడ్డిపాలానికి వచ్చాడు. ఈనెల 10వ తేదీ రాత్రి ఆడపడుచు నిర్మలామేరి, కూతురు సోనీలు కొండారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. 12వ తేదీ(ఆదివారం) రాత్రి 8గంటలకు నిర్మలామేరి మళ్లీ కొండారెడ్డికి ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో పక్కనే ఉన్న నక్షత్రమ్మకు, కూతురు సోని, కొమ్మారెడ్డి మహర్షిలకు విషయం తెలిపింది. దీంతో మహర్షితోపాటు ఇరుగుపొరుగు కలిసి కొండారెడ్డి ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్నాడు. విషయం తెలిసిన భార్య జ్యోత్స్న తాళ్ల చెరువు నుంచి సోమవారం ఉదయం రెడ్డిపాలెం చేరుకుని ఇంటిలోకి వెళ్లి చూడగా తన భర్త చనిపోయి ఉన్నాడు. 10వ తేదీ రాత్రి సుమారు 9 నుంచి 12వ తేదీ రాత్రి 8 గంటల మధ్యలో తన భర్త ఇంట్లో మద్యం సేవించాక పురుగుల మందు తాగడం కానీ, కింద పడడం వల్ల కానీ, ఏదైనా ఇతర కారణాలతో మృతిచెంది ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొంది. ఇంట్లో వెతకగా వంట గదిలో మద్యం తాగిన గ్లాసు, ఫైరిఫాస్ మోనోక్రొటోఫాస్ పురుగుల మందు డబ్బా, మెక్‌డోవెల్స్ మద్యం సీసా లభించాయని తెలిపింది. జ్యోత్స్న ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్‌ఐ పోగుల శ్రీకాంత్‌లు తెలిపారు. కొండారెడ్డి రక్తమడుగులో పడి మృతిచెందడం పలు అనుమానాలకు దారితీస్తోంది. పురుగుల మందు తాగితే నురుగలు కక్కుకొని మృతిచెందుతారని, రక్తమడుగులో పడి ఉండడంపై గ్రామస్తులు ఇది ఆత్మహత్యా...హత్య అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల విచారణలో అసలు విషయం తెలుస్తుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


సూరయ్య మృతదేహం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయపుర ప్రాంతంలో ఓ భవన నిర్మాణం ఎదుట మట్టి పనులు చేస్తున్న వ్యక్తిని లారీ వెనుకవైపు నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు హన్మకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కనకం సూరయ్య (42) బతుకుదెరువు కోసం హనుమకొండకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం లారీ డ్రైవర్ అజాగ్రత్తతో వెనక్కి చూడకుండా రివర్స్ తీయడంతో సూరయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు అయన పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



నేడు వాలంటైన్స్ డే..

వరంగల్ మహానగరంలో నేడు (మంగళవారం) యువతీ, యువకులు ఆనందంగా వాలంటైన్స్ డే జరుపుకోనున్నారు. ఇప్పటికే ప్రేమికులు వైభవంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రేమికుడికి ఇచ్చే గులాబీ, ఇతర బహుమతులను సిద్ధం చేసుకున్నారు.

త్యాగానికి గుర్తుగా వాలంటైన్స్ డే..

క్రీస్తు పూర్వం 270వ సంవత్సరంలో రోమన్ చక్రవర్తి రెండో క్లాడియస్ దేశంలోని సైనికులు పెళ్లిళ్లు చేసుకుంటే ఏకాగ్రతతో యుద్ధం చేయలేరని పెళ్లిళ్లు నిషేధించారు. కానీ సెయింట్ వాలంటైన్ అనే సైనికుడు సైనికులను ప్రేమించేలా ప్రోత్సహించి పెళ్లిళ్లు చేశాడు. దాన్ని సహించలేని రాజు వాలంటైన్‌ను ఫిబ్రవరి 14న ఉరితీశాడు. వాలంటైన్ త్యాగానికి గుర్తుగా ప్రపంచ ప్రేమికులందరూ నాటి నుంచి ఆయన పేరుతో ప్రపంచ ప్రేమికుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు.

రంగుల ప్రేమ!

ప్రేమకు చిహ్నమే గులాబీ

- ప్రేయసికి ఇచ్చే బహుమతిలో ప్రథమస్థానం గులాబీదే
- గులాబీ రంగు పూలతోనే రెండు మనసులను ఒక్కటి చేసేది
- ఒక్కోరంగులో ఒక్కో అర్థం
- నేడు వాలంటైన్స్ డే

ఖిలా వరంగల్: ప్రేమ అనే రెండు అక్షరాలు.. రెండు హృదయాలను కలిపేది. అంగీకారమైన, తిరస్కారమైన గులాబీ పువ్వే చెప్పేస్తుంది. తాను ఇచ్చిన గులాబీ అమ్మాయి జడలోకి వెళ్తే ఆమె మనసులో తనకు స్థానమిచ్చిందని అబ్బాయి భావిస్తాడు. అదే గులాబీ కాళ్ల దగ్గర పడితే ప్రేమకు రెడ్ సిగ్నల్ అని గుర్తించాలి. ప్రేమికుల దినోత్సవ వేళ అబ్బాయిలు తమ ప్రేమను వివిధ గులాబీ రంగుల పూలతో వ్యక్తపరుస్తారు.

రంగు రంగుకో కోడ్..!

ప్రేమలో వర్ణానికి ఓ వివరణ ఉంది. ప్రేమను వ్యక్తీకరించడానికి అబ్బాయిలు అమ్మాయిలకు ముందుగా ఇచ్చే అందమైన బహుమతి గులాబీ. పరిచయం నుంచి ప్రేమ చిగురించి, విరబూసే వరకు ప్రతి ఘట్టంలోను గులాబీలదే ప్రథమ స్థానం. గులాబీ ఒక్కోసారి ఒక్కో రంగులో ఉంటుంది. ఆ రంగుల ప్రేమ లక్షణాలను ఆపాదించింది కూడా యువతరమే.

తెలుపు..

నేనున్నది నీ కోసమే.. అని చెప్పడానికి తెల్ల గులాబీనిస్తారు. స్వచ్ఛమైన ప్రేమకు ఆమె సౌందర్యాన్ని తెల్ల గులాబీలు తెలియజేస్తాయి.

పసుపు..

పరిచయమైన తర్వాత ఇద్దరి మధ్య మొదలైన స్నేహానికి ప్రతీక పసుపు గులాబీలు ఇస్తుంటారు.

ఎరుపు..

ఎర్ర గులాబీ విరిసింది.. తొలి సారి.. నిన్ను కోరి.. అంటూ అందరు పాడుకోకపోవచ్చు. కానీ ఐ లవ్ యూ అంటూ ప్రేమను ప్రకటించుకునేది మాత్రం ఎర్ర గులాబీతోనే. ఇందులో ప్రేమ ఒక్కటే కాదు.. అందం, ధైర్యం, గౌరవం వంటి లక్షణాలు ఉంటాయన్నది ప్రేమికుల విశ్వాసం.



పింక్..

ఈ రంగు గులాబీని సంతోషం, మననం, గొప్పతనం, సౌమ్యం వంటి గుణాలకు చిహ్నంగా భావిస్తారు. అమ్మాయి తన ప్రేమను అంగీకరించిన తర్వాత కృతజ్ఞతలు తెలపడానికి ఇచ్చే బహుమానం పింక్ గులాబీ.

పసుపు గులాబీపై ఎరుపు చాయలు

పద్మానమ్మ ప్రేమలో మరి.. విడ్డూరంగా ఉందిలే ఇదీ.. అని చెప్పడానికి ఇచ్చేది ఈ వర్ణం గులాబీ.

ఆరెంజ్ పగడపు రంగు..

చిన్న పలకరింపుతో మొదలైన మాటలు స్నేహ బంధానికి బీజం వేసి.. ఆ స్నేహం ప్రేమగా మారిన తర్వాత వివాహ బంధానికి ముడి వేయాలన్న భావనను వ్యక్తం చేయడం ఆరెంజ్ పగడపు రంగు గులాబీ చిహ్నం.

ఎరుపు, తెలుపు..

పెళ్లయిన తర్వాత దాంపత్యంలో అన్యోన్యతకు నిదర్శనం ఎరుపు, తెలుపు గులాబీల గుచ్ఛం. మనది ఒక గొప్ప జంట. అని ఒకరి భావాలను ఒకరు పంచుకునే సందర్భంలో ఇచ్చుకునే ఎరుపు, తెలుపు గులాబీల గుచ్ఛం.

ప్రేమకు త్యాగం పరిష్కారం కాదు

ప్రేమ విఫలమవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్న యువత

- గతేడాది కమిషనరేట్‌లో 11 మంది ఆత్మహత్య





వరంగల్ క్రైం: ప్రేమ.. బహుశ ఇది తెలియని మనిషి ఉండరు. ఏదో ఒక సమయంలో ఏ వయసులో నైన దీని బారిన పడక తప్పదెమో అనిపిస్తుంది. కానీ అదే ప్రేమ నేటి యువతను కానరాని లోకాలకు తీసుకుపోతుంది. ఒకప్పుడు ప్రేమంటే త్యాగం, అదృష్టం, ఒక అర్హత ఇలా ఏదో ఒక అంశానికి సంవత్సరాల తరబడి ఒకరినొకరు ఆరాదించేవారు. కాని నేటి ప్రేమలు మారుతున్న కాలంతో పరుగులు పెడుతూ వాట్సప్‌లో చాటింగ్, వీడియో కాల్స్‌తో పలకరింపులు, ఒక హాయ్, రెండు జోక్‌లు, చిన్ని చిన్న గొడవలు అంతలోనే బ్రేక్‌అప్‌లు.. ఇవి సర్వసాధారణం అయ్యాయి. కాని ప్రేమ గొప్పదనం మాత్రం తగ్గలేదు.

క్షణాల్లో మారుతున్న నిర్ణయాలు..

ప్రేమికులుగా తమను ఈ సమాజం అంగీకరించడం లేదనే న్యూనత భావంతో కొంత మంది ప్రేమికులు తమ ప్రాణాలను త్యాగం పేరుతో వదులుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ ప్రేమను ఎక్కడ కాదంటారో అనే భయంతో ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్నారు. జీవితంలో స్థిరపడకపోవడం, చదువుకున్న చదువుకు తగ్గ ఉద్యోగం రాకపోవడం, కులాలు, మతాలు వేరు కావడం ఇలా అనేక కారణాలు ప్రేమికుల ఆత్మహత్యలకు కారణాలు అవుతున్నాయి. అమ్మాయి చనువుగా మాట్లాడితే కూడా కొంత మంది దానిని ప్రేమ అనుకుంటున్నారు. చివరు ప్రపోజ్ చేస్తే నో అనడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొంత మంది తమకు దక్కని ప్రేమ మరెవ్వరికి దక్కవద్దని కసితో దాడులకు పాల్పడుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతేడాది ప్రేమ విఫలం కావడంతో 11 మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ ఏడాది ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు.

ఒకరినొకరు అర్థం చేసుకోవడం లేదు..



తెలిసి తెలియని వయసులో చాలా మంది ఆకర్షణను ప్రేమ అనుకొని జీవితాన్ని ముందుకు సాగనివ్వడం లేదు. చదువుకోవాల్సిన వయసులో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇద్దరు ప్రేమికులు ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకోకుండానే ప్రేమలో పడటం, ఆతర్వాత పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకోవడం, రెండు సంవత్సరాల్లోనే విడిపోయి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటేనే జీవితం ఆనందంగా ఉంటుంది.

-కన్నం కుమారస్వామి,
రూరల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్

కలెక్టరేట్‌కు పరుగులు


గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్, నాయకులు

- చెరువు సర్వేకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు సర్వే చేయాలని కోరుతూ అధికార పార్టీ నేతలు కలెక్టరేట్‌కు పరుగులు పట్టారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'రూ.30 కోట్ల విలువైన చెరువు శిఖం కబ్జా' అనే కథనానికి అధికార పార్టీ నేతలు అలర్ట్ అయ్యారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు అటికం రవీందర్, విక్టర్‌బాబులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ కట్టడాలు ఎక్కువైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రహరీని నిర్మించి, హద్దులు నిర్ధారించాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రగట్టు దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు సాయి, దళిత బహుజన సాహిత్య అకాడమీ జిల్లా చైర్మన్ గాజాల గోవర్ధన్, బీఆర్‌ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శులు నాయకపు శ్రీనివాస్, సమ్మయ్య, దేవస్థాన ధర్మకర్త భరత్ తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో వింటర్ స్కూల్

- జియోస్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ నైపుణ్యానికి దోహదం
- నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు


మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

కాజీపేట అర్బన్: జియోస్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నైపుణ్యం సాధించేందుకు వింటర్ స్కూల్ ప్రోగ్రాం దోహదపడాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ క్యాంపస్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో సోమవారం నేషనల్ జియో స్పేషియల్ పాలసీలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సౌజన్యంతో 'జీయో స్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అంశంపై ఏర్పాటు చేసిన 21 రోజుల వింటర్ స్కూల్ ప్రోగ్రాంను నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిట్ వరంగల్ క్యాంపస్ వింటర్ స్కూల్‌కు వేదికగా నిలవడం అభినందనీయమన్నారు. ఈప్రోగ్రాంను సద్వినియోగపర్చుకుని, జీయోస్పేషియల్ సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అడ్వైజర్ డాక్టర్ దేబప్రియా దత్త వర్చ్యువల్‌గా పాల్గొని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్టీ ప్రతినిధులు డాక్టర్ కె.మృత్యుంజయ, ప్రొఫెసర్లు కేవీ.జయకుమార్, కే.వెంకటరెడ్డి, డాక్టర్ శశి, సైంటిస్టులు, రీసెర్చ్ స్కాలర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


బహుమతులను అందజేస్తున్న రిజిస్ట్రార్, డీఈఓ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ విజేతలకు బహుమతులను అందజేశారు. నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, డీఈఓ అబ్దుల్‌హైలు ముఖ్యఅతిథులుగా హాజరై ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ విజేతలకు నగదు, ప్రశంస ప్రతాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ మాధవిరెడ్డి, బత్తిని కొంరయ్య, వెంకటేశ్వర్‌రావు, వినయ్‌ధర్‌రాజు, సంపత్, శ్రీనివాస్, రమణ, రవికుమార్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో మహాశివరాత్రి ఉత్సవాలు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈఓ శేషగిరి, గంగు ఉపేంద్రశర్మ, సీఐ శ్రీనివాస్‌జీ

హన్మకొండ కల్చరల్: శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ ఈఓ గుల్లపల్లి శేషగిరి అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ శేషగిరి, ఆధ్యాత్మికవేత్తలు శివభక్తులు గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు, మండువ శేషగిరిరావు, హనుమకొండ సీఐ శ్రీనివాస్‌జీ పాల్గొని వేయిస్తంభాల దేవాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రావుల సుదర్శన్, పులి రజనీకాంత్, గంధ్రాతిరాజు, గుడా భరత్ పాల్గొన్నారు.

పరిష్కారం చూపని గ్రీవెన్స్ ఎందుకు?

- అధికారుల్ని నిలదీసిన అర్జీదారులు


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్: ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పనకు ఎన్నోసార్లు వినతులిచ్చామని, అయినా పట్టించుకోకపోతే గ్రీవెన్స్ ఎందుకు పెడుతున్నారు? అంటూ పలు కాలనీల ప్రజలు సోమవారం అధికారులను నిలదీశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందించినా కనీసం క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యవేక్షించి సమస్యను గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం గ్రీవెన్స్‌సెల్‌కు 60 ఫిర్యాదులు అందాయి. వాటిలో 3 ఫిర్యాదులు టౌన్ ప్లానింగ్‌కు చెందిన అతిక్రమణలు, ఆక్రమణలపై వచ్చాయి. ఇక మౌలిక వసతుల కల్పనకు ఇంజనీరింగ్ విభాగం 6, పన్నుల విభాగం 6, ప్రజారోగ్య – శానిటేషన్ విభాగం 8, నీటి సరఫరా విభాగం 3 చొప్పున దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, సీహెచ్ఓ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషన్లు అనిసుర్ రషీద్, జోనా పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- 14వ డివిజన్ ఏనుమాముల మధురానగర్ రోడ్డు నంబరు-3లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, 2013 నుంచి అనేకసార్లు వినతులు సమర్పించినట్లు కాలనీవాసులు కోరారు.
- బల్దియా మెప్మా కార్యాలయ ఆవరణలో దివ్యాంగులకు ప్రత్యేకంగా పబ్లిక్ టాయిలెట్ నిర్మించాలని కాకతీయ, జ్యోతి టౌన్ లెవల్ సమాఖ్యల అధ్యక్షులు వినతి పత్రం అందించారు.
- 16వ డివిజన్ మదర్‌థెరిస్సా కానీలో సీసీ రోడ్డు నిర్మించాలని, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలనీ ఆమనిగంటి ఏలేంద్ర ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ వసూళ్లు పెంచాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు పెంచాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి హనుమకొండ, జనగామ, భూపాలపల్లి సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డీఈలు ఏడీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా సీఎండీ ఎ.గోపాల్ రావు ప్రగతిని సమీక్షించారు. సీఎండీ ఎ.గోపాలరావు మాట్లాడుతూ దత్తత తీసుకున్న గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వినియోగదారులతో మమేకం అవుతూ సందేహాలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వర్ రావు. పి.సంధ్య రాణి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు మోహన్ రావు, అశోక్ కుమార్, కిషన్, సదర్ లాల్, డీ.ఈ ఐటీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పార్కు కబ్జాకు కుట్ర


పార్కును విడగొడుతూ అడ్డంగా నిర్మించిన గోడ

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ శ్రీనగర్ కాలనీ శ్రీరామ పార్కును కబ్జా చేసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ఈ పార్కు స్థలాన్ని వ్యూహాత్మకంగా పార్కులో ఎలాంటి పచ్చదనం, చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం లేకుండా చేశారు. పార్కులో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా చేసి పార్కును మైదానంగా మార్చారు. పార్కు స్థలం మొత్తం చెత్త చెదారం, డిస్‌మెంటల్ వేస్టేజ్‌తో నింపుతూ వాకింగ్ ట్రాక్ ఆనవాళ్లు లేకుండా చేశారు. కుట్రపూరితంగా వాకింగ్ ట్రాక్‌ను ధ్వంసం చేస్తూ.. పార్కును విడగొట్టి కబ్జా చేయడానికి పార్కు మధ్యలో గోడను కడుతున్నారు. కాగా.. ఈపార్కులో ఒక్క మొక్క నాటలేదు. నవంబర్ 2016లో రూ.15 లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. కానీ పార్కులో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. తూతూ మంత్రంగా అభివృద్ధి పనులు చేసి మమ అనిపించారు. శ్రీనగర్ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డిని వాకింగ్ ట్రాక్ ఎవరు ధ్వంసం చేశారని సాక్షి ప్రశ్నించగా.. తనకు తెలియదని సమాధానమిచ్చారు. పార్కులో అడ్డంగా గోడ నిర్మాణం ఎవరు చేస్తున్నారంటే పార్కులో మున్సిపాలిటీ వాళ్లే చేస్తారు కదా అని సమాధానమివ్వడం గమనార్హం.

రమాదేవికి 'జూటూరి' స్మారక పురస్కారం



కాశీబుగ్గ సెంటర్: తెలుగు సాహిత్య సేవలో విశే ష కృషి చేసిన రచయిత బాలబోయిన రమాదేవికి సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్వర్యంలో 2022 సంవత్సరానికి జూటూరి విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తాను రచించిన సాహిత్యాన్ని గుర్తించి మహిళా దినోత్సవం, సరోజినీ నాయుడు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ సత్కారం అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ బి.గోపి
- ప్రజావాణిలో 63 అర్జీల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

వరంగల్ రూరల్: పలు సమస్యలపై ప్రజలు ఇచ్చే వినతులను పరిశీలించి.. త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణిలో కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులను స్వీకరించారు.

ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం..

తన పేర ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఖిలా వరంగల్ తహసీల్ చుట్టూ తిరుగుతున్నా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని, వెంటనే సర్టిఫికెట్ ఇప్పించాలని కుసుమ స్వప్న వినతిపత్రం సమర్పించింది.

\- కుసుమ స్వప్న, ఉర్సు కరీమాబాద్, వరంగల్

నా భూమి కాజేయాలని చూస్తున్నారు..

దేశాయిపేట డాక్టర్స్ కాలనీకి చెందిన చింతం సంతోష్, మధుసూదన్, సూర్యనారాయణ, రజనీకాంత్, శ్రీలత, మధుకర్‌రావు, రామ్మోహన్, పద్మనాభం తదితరులు దళితుడినైన నా భూమిని కాజేయాలని చూస్తున్నారని వినతిపత్రం సమర్పించారు.

\- జన్ను నూతన్‌బాబు, దేశాయిపేట

హక్కుల సాధనకు పాటుపడిన శోభారాణి

- సంతాపసభలో మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జీవన్‌కుమార్


శోభారాణి సంతాప సభలో మాట్లాడుతున్న జీవన్‌కుమార్


కేఎంసీలో శోభారాణి మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్య వ్యవస్థలో మానవ హక్కుల కోసం నిరంతరం పాటుపడిన అధ్యాపకురాలు డాక్టర్ కందాల శోభారాణి అని మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జీవన్‌కుమార్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పార్ట్‌టైం అధ్యాపకురాలు, కవి, రచయిత్రి, మానవహక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షురాలు శోభారాణి ఈనెల 12న మృతి చెందిన విషయం విధితమే. సోమవారం కేయూ సమీపంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిన హక్కుల కార్యకర్త శోభారాణి మృతి సమాజానికి తీరని లోటన్నారు. అనంతరం కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయనీ విద్మహే, ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు టి.జ్యోతిరాణి మాట్లాడారు. తొలుత శోభారాణి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, బన్న అయిలయ్య, పంతంగి వెంకటేశ్వర్లు, శ్రీదేవి, లింగారెడ్డి, కుమారస్వామి, శ్రీధర్‌కుమార్‌లోథ్, ఝాన్సీ, రమ, ప్రజా సంఘాల బాధ్యులు ఉన్నారు. అనంతరం శోభారాణి అంతిమ యాత్ర కేయూ రెండోగేట్ నుంచి ఎస్‌డీఎల్‌సీఈ వరకు కొనసాగింది.

కేఎంసీకి శోభారాణి మృతదేహం అప్పగింత

ఎంజీఎం: కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కందాల శోభారాణి మృతదేహాన్ని కుమారులు, బంధుమిత్రులు సోమవారం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించారు.